
సత్యం జంక్షన్ - తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ఫుట్‌పాత్‌పై బడ్డీలు


ఆక్సిజన్ టవర్స్ ఎదురుగా కాలువపై ఏర్పాటు చేసిన దుకాణాలు


నక్కవానిపాలెం రోడ్డులో ఫుట్‌పాత్‌పై మాంసం దుకాణాలు

అటు ఆక్రమణలు.. ఇటు రాంగ్ పార్కింగ్

- 14, 24 వార్డుల్లో రోడ్లపైనే వాహనాలు
- ఫుట్‌పాత్‌లపై దుకాణాల ఏర్పాటు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డుల్లో రహదారుల ఆక్రమణ, వాహనాల రాంగ్ **పార్కింగ్‌తో** స్థానిక ప్రజలు ఇబ్బందులు పడు**తున్నారు. 24వ** వార్డు నక్కవానిపాలెంలో ఆక్రమణ**లు, అనధికార** పార్కింగ్ కారణంగా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఏఎంజీ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న రోడ్డు మీదే మెకానిక్ గ్యారేజీ నిర్వహించడం తీవ్ర దుమారం రేపుతోంది. ఒక ఆస్పత్రి అంబులెన్స్, పలు కార్లు, వ్యాన్లు పార్క్‌చేసి ఉంచుతున్నారు. రోడ్డు పక్కనే మరమ్మతుల కారణంగా వాహనాలు నిలిపి ఉంచుతున్నారని, ఈ సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడి ఫుట్‌పాత్‌ల మీద యథేచ్ఛగా టిఫిన్ పార్లర్లు, కిరాణా షాపులు, దుకాణాలు పెట్టి ఆక్రమిస్తున్నారు. ఫలితంగా పాదచారులు ఫుట్‌పాత్‌ల మీద అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ ఎదురుగా కల్వర్టు మీద కూడా బడ్డీలు ఏర్పాటు చేశారు. సత్యం జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమణలకు గురయ్యాయి.

రోడ్డు మలుపులో బడ్డీలు.. ట్రాఫిక్ తంటాలు

జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని రోడ్డు మలుపులో ఒక ఇనుప దుకాణం ఏర్పాటు చేయడం గమనార్హం. సాక్షాత్తూ బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయానికి సమీపంలోనే ఈ బడ్డీ పెట్టడంతో ట్రాఫిక్ అవస్థలు తప్పడం లేదని స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడి నుంచి రాధాకృష్ణ లేఅవుట్‌కు వెళ్లే మార్గంలో నిత్యం అధిక సంఖ్యలో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి రద్దీగా ఉండే రోడ్డు మలుపులో బడ్డీ ఏర్పాటు చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఒక వైపు వాహనాల రాంగ్ పార్కింగ్.. మరోవైపు బడ్డీల పేరిట ఆక్రమణలకు పాల్పడటం స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది.

కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్

జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయని ఆరోపణలున్నాయి. పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. గెడ్డలు, కల్వర్టులను ఆక్రమించి మరీ ఏర్పాటు చేస్తున్నా.. జోన్–3 టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సచివాలయం టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, జోన్–3 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.


ఏఎంజీ ఆస్పత్రి వద్ద బారులు తీరిన వాహనాలు


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఫుట్‌పాత్‌పై నిర్మించిన మెట్లు

ఆక్రమణలతో అవస్థలు

నక్కవానిపాలెం ఏఎంజీ ఆస్పత్రి రోడ్డులో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక్కడ రోడ్డు మీదే మెకానిక్ గ్యారేజీ నిర్వహిస్తున్నారు. రోడ్డుపైనే వాహనాల పార్కింగ్, మరమ్మతులు చేస్తున్నారు. ఈ మార్గంలో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

– సుధీర్, నక్కవానిపాలెం

అధికారులు చర్యలు తీసుకోవాలి


బాలయ్యశాస్త్రి లేఅవుట్ నుంచి రాధాకృష్ణ లేఅవుట్‌కు వెళ్లే మార్గం మలుపులో కొత్తగా బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి వద్ద వినియోగదారులు వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్, బాలయ్యశాస్త్రి లేఅవుట్

నేడు వైద్య, రక్తదాన శిబిరాలు

మురళీనగర్: కేరళ కళా సమితి ఆధ్వర్యంలో బిర్లా కూడలిలోని కేరళ కళాసమితి ప్రాంగణంలో ఆదివారం మెగా వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయననున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు జి.ఉన్నితన్, లీలా గణేశన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు నిర్వహించనున్న ఈ శిబిరంలో ఉచిత పరీక్షలతోపాటు తక్కువ రేట్లలో వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. కంటి వైద్య పరీక్షలు, ఆర్థోపెడిక్, కార్డియాక్ ఆరోగ్య పరీక్షలుతోపాటు ఉదయం 8 గంటల నుంచి ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. ఉదయం 11 గంటలకు వీల్ చైర్లు పంపిణీ చేస్తామని చెప్పారు.

జనావాసాల మధ్య బిస్కెట్ తయారీ పరిశ్రమ


పార్వతీనగర్‌లో జనావాసాల మధ్య నిర్వహిస్తున్న బిస్కెట్లు, రస్కుల తయారీ పరిశ్రమ

మద్దిపాలెం: జనావాసాల మధ్య ఎటువంటి అనుమతులు లేకుండా పరిశ్రమను నిర్వహిస్తున్నారని పార్వతీనగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్వతీనగర్ రెసిడెన్షియల్ ఏరియాలో ట్రేడ్ లైసెన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు ఏవీ లేకుండా రస్కులు, బిస్కెట్లు, కేకులు తయారు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల స్థానికులు ప్రశ్నించడంతో తయారీ నిలిపి వేశామని చెబుతూ రాత్రి వేళల్లో యథావిధిగా రస్కులు, బిస్కెట్లు, కేకులు తయారు చేస్తున్నారన్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే తమ పరిస్థితేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

వాల్తేర్ డివిజన్‌లో అత్యాధునిక వాషింగ్ పద్ధతులు


రైలు ఏసీ కోచ్‌లో శుభ్రం చేసిన బెడ్‌షీట్లు, బ్లాంకెట్లు, పిల్లోలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ ప్రయణికులకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణ అనుభూతిని కల్పించేందుకు అత్యాధునిక వాషింగ్ పద్ధతులను అనుసరిస్తూ బెడ్‌షీట్లు, లెనిన్ వంటివి శుభ్రం చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ కోచ్‌ల్లో ప్రయాణించే వారికి బెడ్‌రోల్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ అందజేస్తున్నారు. ఈ కోచ్‌ల్లో ప్రయాణించే ప్రతీ ప్రయాణికుడికి 2–బెడ్‌షీట్లు, 1–బ్లాంకెట్, 1–ఫేస్ టవల్, 1–పిల్లో కవర్, 1– పిల్లో ఇస్తున్నారు. రైలు గమ్యస్థానం చేరిన వెంటనే వీటిని సేకరించి అత్యాధునిక పద్ధతులతో, మెషినరీతో ఏర్పాటు చేసిన లాండ్రీకి తరలించడం, శుభ్రం చేసిన వాటిని మళ్లీ రైళ్లలో అందించడం జరుగుతుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ సీజన్‌లో రైళ్లలో ఏసీలను 24 డిగ్రీలకు నిర్వహిస్తున్నారు.

వైభవునికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి, సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30గంటలకు బాలభోగం, 9.30గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇంటికి చేరిన కాన్పూర్ వాసి


శ్రీకిషన్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు

సీతమ్మధార: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ దగ్గర కమలానగర్‌కు చెందిన శ్రీకిషన్ ఎనిమిదేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. అతను ఒక రైతు బిడ్డ, వ్యవసాయం చేసేవాడు. వ్యాధి పట్ల అవగాహన లేక తండ్రి మంత్రగాడిని ఆశ్రయించడంతో శ్రీ కిషన్ ఆరోగ్యం మరింత క్షీణించింది. దీంతో 5 నెలల క్రితం ఇంట్లో నుంచి పరారయ్యాడు. ఇతని భార్య ఇంకొకరిని పెళ్లి చేసుకుంది. విశాఖ రైల్వే స్టేషన్లో పట్టుకున్న శ్రీ కిషన్‌కు శ్రద్ధా ఫౌండేషన్ చికిత్స అందించడంతో అతను కోలుకున్నాడు. తన చిరునామా చెప్పడంతో వైజాగ్ నుంచి నేరుగా తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఐటీఐలో ఎలక్ట్రికల్ సర్వీస్ కోర్సులో శిక్షణ

కంచరపాలెం: కంచరపాలెం పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో స్కిల్ హబ్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. 10వ తరగతి ఆ పైన చదువుతున్న నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 77025 06614 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రజల శ్రేయస్సే సహకార బ్యాంకుల లక్ష్యం


మానం ఆంజనేయులును సత్కరిస్తున్న సహకార రంగ ప్రముఖులు, పార్టీల నాయకులు, ప్రతినిధులు

సీతమ్మధార: ప్రభుత్వరంగ బ్యాంకులు కార్పొరేట్‌కు, పెద్ద వ్యాపారులకే రుణాలు ఇస్తున్న నేపథ్యంలో సహకార బ్యాంకులు సామాన్యులకు రుణాలు అందించాలని ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ పూర్వ చెర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. వీసీబీ ఆధ్వర్యంలో శనివారం పోర్టు కళావాణి ఆడిటోరియంలో ఆంజనేయులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను సహకార రంగ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, కార్మిక, కర్షక సంఘాల ప్రతినిధులు, వీసీబీ ప్రతినిధులు సత్కరించారు. ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ చెర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ సహకార రంగంలో ఆంజనేయులు చేసిన కృషిని కొనియాడారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ తన కుటుంబంతో ఆంజనేయులుకు ఉన్న సన్నిహిత సంబంధాలను వివరించారు. విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్‌పై ప్రజలకు అత్యంత విశ్వాసం కల్పించడంలో ఆంజనేయులు చేపట్టిన విధానాలు అనుసరణీయమన్నారు. కాకినాడ టౌన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చెర్మన్ చిట్టూరి రవీంద్ర, పారిశ్రామిక వేత్త ప్రభాకరరావు, మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వ్యవస్థాపక చెర్మన్ ఎం.ఆర్.కె.రాజు, ది గుత్తి టౌన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చెర్మన్, ఏపీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ జిలాని, కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కనకమహాలక్ష్మి బ్యాంక్ డెరైక్టర్, పారిశ్రామిక వేత్త ఆర్.వెంకటరావు, హిందుస్థాన్ షిప్‌యార్డ్ స్టాఫ్ కో ఆపరేటివ్ బ్యాంక్ చెర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, వీసీబీ డెరైక్టర్ జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సహకార బ్యాంకుల అభివృద్ధిలో మానం ఆంజనేయులు చేసిన కృషి, సేవలను ప్రశంసించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సీతమ్మధార: నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (విశాఖపట్నం జిల్లా)ను శనివారం ఎన్నుకున్నారు. జిల్లాలో సుమారు 1000 మంది ఉద్యోగులు పని చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్‌లో అనేకమంది 20 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని, వారి సమస్యలపై పోరాడేందుకు ఈ నూతన కమిటీని ఉద్యోగులు సమష్టిగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. విశాఖ జిల్లా, ఎన్ఎంహెచ్ జేఏసీ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా జి.శశిభూషణ్ రావు, అధ్యక్షుడిగా ఆర్. సురేష్, జనరల్ సెక్రటరీగా వి.వీర బ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.సి.హెచ్. నాగరాజు, కోశాధికారిగా గోపీనాథ్ (ల్యాబ్ టెక్నీషియన్), వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.మోహన రావు ఎన్నికయ్యారు.

తెలుగు వెలుగు చాటిన మహాకవి గురజాడ

- గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ
- అభ్యుదయ కవితా పితామహుడి వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు పోటీలు


వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థి

మురళీనగర్: తెలుగు భాష గొప్పదనాన్ని చాటి చెప్పిన మహా కవిగా మన గురజాడ అప్పారావు చరిత్రలో నిలిచిపోయారని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని సాహితి స్రవంతి ఆధ్వర్యంలో గైస్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాడుక భాషకు అత్యంత ప్రాధానత్యనిచ్చి ఆనాటి సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు ఆయన తన కవిత్వం, నాటకాల రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు జీవిత చరిత్ర, గేయ రచనలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్.రాము, పి.దుర్గాప్రసాద్, సీహెచ్ తన్వీర్, జి.అమృత, ఎన్.సాగరకుమార్ విజేతలుగా నిలిచారు. వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాహితి స్రవంతి అధ్యక్షుడు పెంటకోట రామారావు, సభ్యులు సీహెచ్ సుమిత్ర, పి.భానుమూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

జోరువానలోనూ కొనసాగిన దీక్షలు


పోర్టు హాస్పిటల్ వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: జోరువాన, హోరుగాలులను సైతం లెక్కచేయకుండా పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. సిటూ ఆధ్వర్యంలో 61 రోజులుగా జరుగుతున్న దీక్షలు శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు ఆస్పత్రి తమ కష్టార్జితంతో ఏర్పడిందన్నారు. దీనిని ఎవరికో అమ్ముతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. 40 వేల మంది కార్మికుల ఆరోగ్యాలకు సంబంధించిన హస్పిటల్‌ను ప్రైవేటుపరం చేస్తుంటే కూటమి ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ఎందుకు స్పందిచడం లేదని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షలలో జక్కాన సత్యనారాయణ, సాంబమూర్తి, శంకర రావు, పైడిరాజు, నాయుడు, కె.ఎస్.కుమార్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవలు మరువలేం

ఉపాధ్యాయిని ఇంద్రాణికి భారమైన హృదయంతో వీడ్కోలు


పదవీ విరమణ పొందిన కురుమెళ్ల ఇంద్రాణితో హెచ్‌ఎం, సహచరులు

తాటిచెట్లపాలెం: విద్యార్థులను క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన ఉపాధ్యాయిని కురుమెళ్ల ఇంద్రాణి సేవలు మరువలేమని ప్రధానోపాధ్యాయుడు జి.సన్యాసిరావు పేర్కొన్నారు. రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో సోషల్ టీచర్‌గా విధులు నిర్వర్తించి, శనివారం పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆమెకు సహచర సిబ్బంది భారమైన హృదయాలతో వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఆమె ఎంతో కృషి చేశారన్నారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఆమె తన సంపాదనతో ఆర్థికంగా వెనుకబడిన ఎందరో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, స్టడీ మెటీరియల్ అందజేశారన్నారు. ఆమె విశ్రాంత జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.

గురజాడ అడుగు జాడల్లో నడవాలి


గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

సీతమ్మధార: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి జీవీఎంసీ గాంధీ పార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా సీనియర్ నాయకులు జి. మణి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. పద్మ, వై. సత్యవతి మాట్లాడుతూ గురజాడ అడుగుజాడల్లో నడవాలని అన్నారు. ఆయన కన్యాశుల్కానికి, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. సమాజం, ప్రభుత్వంలో మార్పు రావాలని, గురజాడ అడుగుజాడల్లో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.మణి, ఆర్.వరలక్ష్మి, బి. భారతి, కె. కుమారి, ఆర్. విమల, బి. మమత, ఎం. నిర్మల, కె.సంతోషం, జి.మణి, కె.సత్యవతి, ఆర్. పార్వతి, ఆర్.ముత్యాలమ్మ, పి.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

మాలల గర్జన పోస్టర్ ఆవిష్కరణ


ఉత్తరాంధ్ర మాలల గర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

సీతమ్మధార: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర మాలల గర్జనను ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు తెలిపారు. రామాటాకీసు రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దళిత ఉద్యమ నాయకులు మల్లేపల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపీ జీ.వి.హర్ష కుమార్, గోపీనాథ్, ఉప్పులేటి దేవి ప్రసాద్, పి.ఎస్.ఎన్. మూర్తి, ఎర్రమల్లు రాములు తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీయటానికే ఇలాంటి చర్యలకు పాలకులు పాల్పడుతున్నారని, దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమ కన్వీనర్ పతివాడ రాంబాబు మాట్లాడుతూ గర్జనకు దళిత బహుజనులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు, అంబేడ్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షుడు డి.కృష్ణ, ఏఐడీఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గాతాడ జగజ్జీవన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ కోటేశ్వరరావు, దళిత సేన సిటీ వైస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్ల మాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా


వివరాలు వెల్లడిస్తున్న జలగం కుమార్ స్వామి

సీతమ్మధార: ఈ నెల 5 నుంచి నిర్వహించనున్న విశాఖ ఆర్గానిక్ మేళాను విజయవంతం చేయాలని భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమార్ స్వామి పిలుపునిచ్చారు. పీఅండ్‌టీ కాలనీలోని కేశవ్ సేవా సమితి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో 5వ ప్రకృతి ఆధారిత పంటల మేళా నిర్వహిస్తున్నామన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించి పండించే పంటలు అనారోగ్యం కలిగిస్తాయని, పర్యావరణానికి నష్టం కలుగుతుందని వివరించారు. ప్రకృతి ఆధారిత పంటలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యకరమన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ మాట్లాడుతూ 5వ తేదీ ఉదయం 10 గంటలకు రైతుల సమ్మేళనం, 6న మీ ఆరోగ్యం మీ చేతిలో, 7న ఫుడ్ ప్రాసెసింగ్, 8న మిద్దె తోటలు కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పాలెం నేచురల్స్ అశోక్, సత్వా నేచురల్స్ మధుసూదన్ రెడ్డి, అవని ఆర్గానిక్స్ ఉషా గజపతిరాజు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ వాగ్దానం నిలబెట్టుకోవాలి

సీతమ్మధార: ఎన్నికల్లో ఇచ్చిన స్టీల్‌ప్లాంట్ రక్షణ వాగ్దానాన్ని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని ఐద్వా నాయకులు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్షలో పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు చేస్తున్న పోరాటం 1342వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తుందన్నారు. విశాఖ ప్రజలు, కార్మికులు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే స్టీల్ ప్లాంట్‌ని కాపాడతారు అని భావించారు అన్నారు. అయితే ఇంత వరకు స్టీల్ ప్లాంట్ రక్షణకు ప్రధానితో ఒక్కసారి కూడా ఆయన మాట్లాడినట్లు లేదన్నారు. కేంద్రంలో బీజేపీకి, మోదీకి వంత పాడుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వానతో సాగని వ్యాపారాలు

- చిరువ్యాపారుల దిగాలు


ఖాళీగా ఉన్న సీతమ్మధార రైతుబజారు

సీతమ్మధార: తుఫాన్ ప్రభావంతో గురువారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. వాన తెరిపివ్వకపోవడంతో జనసంచారం లేక, వ్యాపారాలు సాగలేదు. 24వ వార్డు నక్కవానిపాలెంలోని చిరు వ్యాపారులు వర్షం కారణంగా తోపుడు బళ్లు తెరవడంలేదు. సీతమ్మధార రైతుబజారులో వ్యాపారాలు లేక వినియోగదారుల కోసం రైతులు ఎదురు చూడాల్సి వచ్చింది.

రోడ్లు జలమయం

వర్షానికి నక్కవానిపాలెం క్రాంతినగర్, గాంధీనగర్, రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. 14వ వార్డులోని బాలయ్య శాస్త్రి లేఅవుట్, నార్త్ ఎక్స్‌టెన్షన్, గణేష్‌నగర్, సీతమ్మధార, ఏఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, రాధాకృష్ణ లేవుట్ తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.